7

సాక్షి ములుగు

బుధవారం । 13 । ఆగస్టు । 2025



శైవ క్షేత్రాల సందర్శనకు..

శ్రావణమాసం సందర్భంగా శైవక్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ బస్సులు నడవనున్నట్లు ఆర్ఎం విజయభాను తెలిపారు. - 8లో▸



సగానికిపైగా డిగ్రీ సీట్లు ఖాళీ

కేయూ పరిధిలో ఈ విద్యాసంవత్సరం 2025–26లో డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సగానికిపైగా సీట్లు ఖాళీగానే ఉన్నాయి. - 8లో▸

గరిష్టం/కనిష్టం
34.6^0 /20.4^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గెజిట్ విడుదల చేయాలని వినతి



ములుగు రూరల్ : ఐదో షెడ్యూల్ ప్రకారం పరిశ్రమల జీఓల గెజిట్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నాలుగు కనీస వేతన సవరణ మండలాలను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ మేరకు తక్షణమే గెజిల్ విడుదల అయ్యేలా చూడాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు లక్ష్మయ్య, మొగిలి, రమేష్ రాజు, రవీందర్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి అరెస్టు సరికాదు



సిరికొండ బలరాం

ములుగు రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూజలు చేయవద్దని, త్రివర్ణ పతాకం ఎగురవేయద్దంటూ ఆంక్షలు పెడుతుందని ఆరోపించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఆలయ కమిటీ ఎన్నిక

భూపాలపల్లి రూరల్: శ్రీ సీతారామ తెలంగాణ సకల కళల కళాకారుల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు పోల్సాని దేవేందర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బౌతు లక్ష్మయ్య, కోశాధికారిగా ఎడ్ల రాము, సహాయ కార్యదర్శిగా తరాల సమ్మక్క, ఉపాధ్యక్షుడిగా తాళ్లపల్లి శంకర్, గడ్డం లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులుగా రంగు రవీందర్ గౌడ్, లలిత, అట్యాపురం తిరుపతి, గువ్వ లక్ష్మి, చిలుక రమాదేవిలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

సైబర్ బాధితుడికి చెక్కు అందజేత



భూపాలపల్లి అర్బన్: సైబర్ నేరంతో మోసపోయిన బాధితుడికి రూ.1.20లక్షల చెక్కును మంగళవారం భూపాలపల్లి పోలీసులు అందించారు. సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్‌కు చెందిన బొప్పర్తి హరికృష్ణ సైబర్ మోసగాళ్ల చేతిలో రూ.1.75లక్షలు మోసపోయాడు. బాధితుడు నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయగా రూ.1,54,500 హోల్డ్ చేశారు. దర్యాప్తు జరిపి మొదటి విడతగా రూ.1,20లక్షల చెక్కును కోర్టు ద్వారా ఇప్పించి బాధితుడికి అందజేసినట్లు సీఐ తెలిపారు. బాధితుడికి సకాలంలో రిఫండ్ అందజేయడంలో కృషి చేసిన సైబర్ వారియర్ తిరుపతిని సీఐ అభినందించారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



భూపాలపల్లి అర్బన్: ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం జిల్లాకేంద్రంలోని కొమురయ్య భవనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొత్కు ప్రవీణ్‌కుమార్ హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 30వ తేదీ వరకు ఏఐఎఫ్ఐ ఆధ్వర్యంలో క్రీడలు, సెమినార్‌లు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల జోసఫ్, నాయకులు పోతుల పవన్, భగత్, రాజేష్, శరణ్య, లావణ్య, అజయ్, వినోద్, రాకేష్, సంపత్ పాల్గొన్నారు.



పాత పద్ధతిలోనే పది పరీక్షలు

ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ డైరెక్టర్

- రాత పరీక్షకు 80, ఇంటర్నల్‌కు 20 మార్కులు
- జిల్లా వ్యాప్తంగా 4,186 మంది విద్యార్థులు

వెంకటాపురం(ఎం): పదో తరగతి పరీక్షలు పాత పద్ధతిలోనే జరగనున్నాయి. రాత పరీక్షకు 80 మార్కులు, ఇంటర్నల్ 20 మార్కులను యథావిధిగా కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉపాధ్యాయ సంఘాలు ఇంటర్నల్ మార్కుల విధానాన్ని స్వాగతిస్తున్నప్పటికీ విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచిన తర్వాత విద్యాశాఖ ఆదేశాలు ఇవ్వడంపై మరికొంతమంది ఉపాధ్యాయులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పరీక్షలపై ప్రభుత్వానికే స్పష్టత లేకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2011 నుంచి 80 మార్కులకు రాత పరీక్ష, 20 మార్కులకు ఇంటర్నల్ నిర్వహిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఆయా పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులకు 20 కి 20 ఇంటర్నల్ మార్కులు వేస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతం పడిపోతుందనే నెపంతో ప్రభుత్వం ఇంటర్నల్ మార్కుల విధానాన్ని రద్దు చేసి 2024–25 విద్యా సంవత్సరం నుంచే 100 మార్కులకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొంది. ఉపాధ్యాయ సంఘాలు, ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు వ్యతిరేకించడంతో ప్రభుత్వం తన నిర్ణయాన్ని గతేడాది వెనక్కి తీసుకుంది. 2025–26 నుంచి 100 మార్కులకు రాత పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించి రెండు నెలలు గడిచిన తర్వాత పాత విధానాన్నే కొనసాగిస్తున్నట్లు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

ఎన్‌సీఈఆర్‌టీ అభిప్రాయం మేరకే..

పదో తరగతిలో ఇంటర్నల్ మార్కులను రద్దు చేయడంపై జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) ప్రభుత్వాన్ని ప్రశ్నించినట్లు తెలిసింది. సీబీఎస్ఈ పదో తరగతిలో 20 శాతం ఇంటర్నల్స్, 80 శాతం వార్షిక పరీక్షలకు మార్కులు కేటాయిస్తే తెలంగాణలో ఎలా ఇంటర్నల్స్‌ను రద్దు చేస్తారని ఇటీవల నిర్వహించిన వర్క్‌షాప్‌లో రాష్ట్ర విద్యాశాఖ అధికారులతో చర్చించినట్లు సమాచారం. దీంతో విద్యాశాఖ అధికారులు పాత విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడంతో ప్రభుత్వం అంగీకరించగా విద్యాశాఖ అధికారులు ఇంటర్నల్ విధానాన్ని యథావిధిగా అమలు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

10 మండలాల్లో.. 4,186 మంది విద్యార్థులు

జిల్లాలోని 10 మండలాల పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో కలిపి 53 హైస్కూల్స్ ఉండగా 2025–26 విద్యాసంవత్సరానికి గాను 4,186 మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఈ ఏడాది జూన్‌లో విద్యాశాఖ 100 మార్కులకే వార్షిక పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టత ఇచ్చింది. దీంతో ఉపాధ్యాయులంతా విద్యార్థులను సబ్జెక్టుల వారీగా గత రెండు నెలలుగా 100 మార్కుల పేపరుకే సన్నద్ధం చేస్తూ వచ్చారు. ప్రస్తుతం విద్యాశాఖ 80 మార్కులకు రాత పరీక్షలు, 20 ఇంటర్నల్ మార్కులు అని ఆదేశాలివ్వడంతో ఉపాధ్యాయులు అయోమయంలో పడ్డారు. విద్యాసంవత్సరం ఆరంభంలోనే ప్రభుత్వం వార్షిక పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని, విద్యా సంవత్సరం ఆరంభమైన రెండు నెలల తర్వాత వార్షిక పరీక్షలు, ఇంటర్నల్ మార్కులపై ఆదేశాలు ఇవ్వడం వల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందని కొంతమంది ఉపాధ్యాయులు అభిప్రాయపడుతుండగా, మరికొంతమంది ఉపాధ్యాయులు ఇంటర్నల్ మార్కుల విధానాన్ని స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది



ఇంటర్నల్ మార్కుల విధానంతో విద్యార్థులు సొంతంగా ప్రాజెక్టులు తయారు చేయడం, స్లిప్ టెస్టులు, నోట్స్ రాయడం ద్వారా నైపుణ్యాలు పెరిగి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో ఇంటర్నల్ మార్కుల విధానం అమలులో ఉంది. ఇంటర్నల్ మార్కుల విధానం విద్యార్థుల ప్రగతికి దోహదపడుతుందని ఎన్‌సీఈఆర్‌టీ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఇంటర్నల్ మార్కుల విధానాన్ని ప్రభుత్వం అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నాం.

- జనగాం బాబురావు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ నిర్ణయంతో గందరగోళ పరిస్థితులు



విద్యా సంవత్సరం ప్రారంభమైన రెండు నెలల తర్వాత విద్యాశాఖ ఇంటర్నల్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు ఆదేశాలివ్వడంతో ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇంటర్నల్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో 100 మార్కులకు విద్యార్థులను రెండు నెలలుగా సన్నద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయంతో విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇంటర్నల్ విధానాన్ని రద్దు చేసి 100 మార్కులకే వార్షిక పరీక్షలు నిర్వహించాలి.

- ఏళ్ల మధుసూదన్, ఎస్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఏజెన్సీలో భారీ వర్షం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- ఏఎస్పీ శివం ఉపాధ్యాయ



ఏటూరునాగారంలో కురుస్తున్న వర్షం

ఏటూరునాగారం: ఏజెన్సీలోని ఏటూరునాగారం, కన్నాయిగూడెం తదితర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో అధికారులు అప్రమత్తమై అన్ని శాఖల అధికారులు మండల కేంద్రాల్లోనే ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. మండల పరిధిలోని కొండాయి, ఎలిశెట్టిపల్లి జంపన్నవాగు వద్ద సిబ్బందితో పహారా ఏర్పాటు చేసి రాత్రివేళల్లో వాగు దాటకుండా చర్యలు చేపట్టారు. మరో నాలుగు రోజులు వర్షాలు ఉండడంతో గోదావరి, జంపన్నవాగు, చెరువుల మత్తళ్లను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

రాబోయే నాలుగురోజులు భారీ వర్షాలు



మాట్లాడుతున్న ఏఎస్పీ శివం ఉపాధ్యాయ

రాబోయే నాలుగు రోజులు అతి భారీ వర్షాలు ఉండడంతో ఏజెన్సీలో గోదావరి, వాగులు ఉప్పొంగి ప్రవహించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉందని తెలిపారు. దీంతో వాగులు దాటడం, చేపలు, పడవల్లో ప్రయాణం చేయడం మానుకోవాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు వర్షాలు ముగిసే వరకు ప్రయాణాలను మానుకోవాలని తెలిపారు. అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఆహారం, నీరు, మందులు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎవరికైనా ఏదైనా అవసరమైతే వెంటనే 100 డయల్ చేయడం లేదా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శిథిలమైన ఇళ్లలో ఉండవద్దని, వృద్ధులు, పిల్లలు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



హర్ ఘర్ తిరంగా ర్యాలీ

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలకేంద్రంలో జాతీయ రహదారిపై నాయకులు మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, మండల ఇన్‌చార్జ్ పల్లా బుచ్చయ్య హాజరై మాట్లాడారు. ఆపరేషన్ సింధూర్‌లో మన సైనికుల వీరత్వానికి నిదర్శనంగా ప్రతీఇంటిపై జాతీయజెండా ఎగురవేసి దేశభక్తిని చాటాలన్నారు. ప్రధానమంత్రి మోదీ ఆధ్వర్యంలో మేకింగ్ ఇండియాగా దేశం ప్రపంచంలోనే మూడో ఆర్థిక వ్యవస్థగా నిలిచిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భర్తపురం నరేష్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణాకర్‌రావు, మల్లెల రాంబాబు, జిల్లా కార్యదర్శి మెడిశెట్టి ఓంప్రకా, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి జంగా హన్మంతరెడ్డి, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి సిద్ధబోయిన సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలి

డీఎంహెచ్‌ఓ గోపాల్‌రావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

ములుగు రూరల్: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పిస్తేనే చైతన్యవంతులు అవుతారని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో ఇంటర్ నేషనల్ యూత్‌డే సందర్భంగా ఇంటెన్ ఫైడ్, ఐఈసీ క్యాంపును ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణలో యువత పాత్ర ఎంతో ముఖ్యం అన్నారు. యూత్ డే సందర్భంగా ఇంటెన్స్ ఫైడ్ కార్యక్రమాలు 12 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించాలి

జిల్లాలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు చేయించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గోపాల్‌రావు సూచించారు. ములుగు జనరల్ ఆస్పత్రిలో ఆస్పత్రి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న లవకుమార్ తన భార్యకు ప్రభుత్వ ఆస్పత్రిలోనే డెలివరీ చేయించారు. ఈ సందర్భంగా లవకుమార్‌ను ఆయన అభినందిచారు. ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వ వైద్యశాలల్లో డెలివరీ చేయించడం వల్ల సామాన్య ప్రజలకు ప్రభుత్వ సేవలపై మరింత నమ్మకం కలుగుతుందన్నారు. అనంతరం ఆయన టీ హబ్‌ను సందర్శించారు. డెంగీ, మలేరియా రక్త పరీక్షల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కీటక జనిత జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, డెమో సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని వినతి



డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఆర్టీసీ డిపో నుంచి వెంకటాపురం మండలానికి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో భద్రాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల ప్రధాన కార్యదర్శి సాధనపల్లి విజయ్ మాట్లాడుతూ రెండు నెలలుగా మండలానికి బస్సు రాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యార్థులు స్కూల్‌కు వెళ్లేందుకు ఆటోలకు రోజుకు రూ.100 ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్మోహన్‌నాయుడు, ముత్యాల శ్రీనివాస్, నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఈ ఏడాది మేలో నిర్వహించిన బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల సెమిస్టర్ పరీక్షల పలితాలు, దూరవిద్య కేంద్రం డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షల ఫలితాలను వీసీ కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ వి.రామచంద్రం మంగళవారం విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 31 శాతం, రెండో సెమిస్టర్‌లో 30 శాతం, మూడో సెమిస్టర్‌లో 35 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 39 శాతం, దూరవిద్య మొదటి సెమిస్టర్ పరీక్షల్లో 24 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. రీవాల్యుయేషన్‌కు ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు. ఫలితాలను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో చూడాలని వారు కోరారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు ఎం.తిరుమలాదేవి, జి.పద్మ, ఆసిం ఇక్బాల్, చిత్ర రాజు, వి.మహేందర్, పి.వెంకటయ్య అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.నేతాజీ, క్యాంపు ఆఫీసర్ ఎస్.సమ్మయ్య పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

- ఐటీడీఏను ముట్టడించిన ఎస్ఎఫ్ఐ నాయకులు
- 163 జాతీయ రహదారిపై ధర్నా విరమింపజేసిన పోలీసులు



ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీడీ పోచానికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

ఏటూరునాగారం: గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గిరిజన విద్యాసంస్థల్లో పెండింగ్ బిల్లులు చెల్లించాలని, విద్యార్థుల సమస్యలు పరిష్కరించి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయాన్ని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం 163 జాతీయ రహదారిపై ధర్నా చేపట్టగా పోలీసులు అక్కడకు చేరుకుని ధర్నాను విరమింపజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ బిల్లులు విడుదల కాకపోవడంతో వార్డెన్లు బంగారం కుదవపెట్టి ఆశ్రమ పాఠశాలలను నడుపుతున్నారని తెలిపారు. ఆశ్రమ పాఠశాలల హాస్టళ్లలోని వార్డెన్లకు రోజురోజుకూ ఖర్చుల భారం పెరిగిపోతున్నా బిల్లులు మాత్రం రావడం లేదన్నారు. అదే విధంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో టీచర్లు లేరని, బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు, హాస్టళ్లలో ఫ్యాన్లు పనిచేయడం లేదని తెలిపారు. పెద్ద గొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలోనే పూర్తిస్థాయిలో బాత్‌రూమ్స్, మరుగుదొడ్లు, ఫ్యాన్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ఐటీడీఏ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. బాలికల హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో మహిళలే టీచర్లు, వర్కర్లుగా ఉండాలని నిబంధన ఉన్నా అందుకు భిన్నంగా పురుషులను నియమించడం ఏమిటని ప్రశ్నించారు. వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లోని విద్యార్థులు ఏటూరునాగారంలో ఐటీఐ, జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాలకు వెళ్లివచ్చే సమయంలో సరిగా బస్సులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అన్ని కళాశాలల ఉపకారవేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నప్పటికీ పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ ఏపీఓ వసంతరావు, డీడీ పోచంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాగటి రవితేజ, టీఎల్ రవి, జిల్లా ఉపాధ్యక్షుడు కోకిల బాలు, జిల్లా సహాయ కార్యదర్శి సోడి అశోక్, జిల్లా కమిటీ సభ్యులు కుమ్మరి నర్సింగరావు, మండల నాయకులు రాకేష్, సాంబశివరావు, హేమంత్, జస్వంత్ సంతోష్ మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగిపై విచారణ



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో విధులు నిర్వర్తిస్తూ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఉద్యోగిపై దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి విచారణ చేపట్టారు. ఉద్యోగిపై వస్తున్న ఆరోపణలపై మంగళవారం ఆరాతీశారు. దేవస్థానంలోని అర్చక, సిబ్బందితో ఆమె ప్రత్యేకంగా చర్చించి వారి వాంగ్మూలాన్ని సేకరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాలతో ఆరోపణలు వస్తున్న ఉద్యోగిపై విచారణ చేశామని, నివేదికలు సమర్పిస్తామని తెలిపారు. ఆమెతో వరంగల్ ఏసీ సునీత, ఈఓ మహేష్, ఉపప్రధాన అర్చకుడు పనకంటి ఫణీంద్రశర్మ తదితరులు ఉన్నారు.

నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్‌రెడ్డి



రక్షణపై ప్రతిజ్ఞ చేస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారులు

భూపాలపల్లి అర్బన్: పని గంటలు పెంచుతూ సింగరేణి ఉద్యోగులు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఏనుగు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తున్న మల్టీ డిపార్ట్‌మెంటల్ అవగాహన సమావేశాలలో భాగంగా మంగళవారం ఏరియాలోని కేటీకే 5వ గనిలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి జీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించుకున్న 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, పని గంటలు పెంచుతూ ఎస్‌డీఎల్ యంత్రాలను నడపాలని భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని, ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు. నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకితభావంతో పనిచేయాలన్నారు. భద్రత పట్ల అశ్రద్ధ వహించకుండా అధికారులు, సూపర్‌వైజర్లు సంబంధిత ఉద్యోగులకు భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతీ ఉద్యోగి సక్రమంగా పనిచేస్తూ వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూ, సంస్థ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సంవత్సరం తేనెటీగల పెంపకం గురించి అవగాహన తరగతులను నిర్వహిస్తున్నామని, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా ఇప్పటి వరకు మూడు కోర్సులను విజయవంతంగా పూర్తిచేశామని తెలియజేశారు.

సగానికిపైగా డిగ్రీ సీట్లు ఖాళీ

కేయూ పరిధిలో మొత్తం 97,930 సీట్లకు భర్తీ అయ్యింది 40 వేలే..

- మూడు దశలు, స్పెషల్ ఫేజ్ ప్రవేశాలు కూడా పూర్తి
- నేడు, రేపు ప్రైవేట్ కళాశాలలకు స్పాట్ అడ్మిషన్లు
- ఇంజనీరింగ్, మెడిసిన్, ఇతర కోర్సుల వైపే విద్యార్థుల మొగ్గు
- సాంకేతిక కోర్సులు అందించినా ఆదరణ కరువు



కేయూ పరిధిలో మొత్తం
డిగ్రీ కళాశాలలు : 211
మొత్తం సీట్లు : 97,930
భర్తీ అయిన సీట్లు : 40,585

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లోని డిగ్రీ కళాశాలల్లో వివిధ కోర్సుల్లో సగానికిపైగా సీట్లు ఖాళీగానే ఉన్నాయి. కొన్ని కళాశాలల్లో సీట్లు ఎక్కువ శాతం భర్తీకాగా మరికొన్ని కళాశాలల్లో తక్కువ భర్తీ అయ్యాయి. పలుకోర్సులకు డిమాండ్ ఉండగా కొన్నింటికీ అంతగా ఆదరణ లభించడం లేదు. మూడు దశల్లోనూ డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ (దోస్త్) ద్వారా ఈ విద్యాసంవత్సరం ప్రవేశాలు కల్పించారు. ఇప్పటికే మూడు దశల్లో ప్రవేశాలు కల్పించగా స్పెషల్ ఫేజ్‌లో సీట్లు కేటాయించిన వారికి రిపోర్టింగ్ కూడా మంగళవారం ముగిసింది. యూనివర్సిటీ పరిధిలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్, అటానమస్ డిగ్రీ కాలేజీలు 211 ఉన్నాయి. అందులో బీఏ, బీఎస్సీ, బీకామ్ జనరల్, బీకామ్ కంప్యూటర్స్, బీబీఏ, బీఎస్సీ కంప్యూటర్స్, బీబీఏ రిటైల్ పలు కోర్సులు కంప్యూటర్ బేస్డ్ తో కూడా ఉన్నాయి. లైఫ్ సైన్సెస్ కోర్సులు కూడా ఉన్నాయి. ఇందులో 97వేల 930సీట్లు ఉన్నాయి. మూడుదశల్లోనూ, స్పెషల్ ఫేజ్‌లో కలిపి ఇందులో సోమవారం వరకు 40,585 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. అక్కడక్కడ కాలేజీల్లో వేళ్లమీద లెక్కపెట్టేంత మంది అడ్మిషన్లు మినహా ఇంకా సగానికిపైగా సీట్లు ఖాళీగానే ఉండబోతున్నాయి.

ఇంజనీరింగ్, మెడిసిన్ వైపు మొగ్గు..

విద్యార్థులు సంప్రదాయ డిగ్రీ కోర్సుల వైపు కంటే వృత్తివిద్య, ఉపాధి కోర్సులవైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఇంజనీరింగ్, మెడిసిన్, పారా మెడికల్ తదితర కోర్సుల్లో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు. డిగ్రీ కోర్సుల్లో కంప్యూటర్ కాంబినేషన్ కోర్సులు డాటా సైన్స్ లైఫ్ సైన్సెస్‌తో కూడిన తదితర కోర్సులున్నప్పటికీ అంతగా ఆసక్తి చూపడం లేదు. డిగ్రీ విద్యార్థుల కోసం కొన్ని సంవత్సరాలుగా కేయూ పరిధిలో 30 వరకు గురుకుల డిగ్రీ కళాశాలలు కూడా ఏర్పాటై కొనసాగుతున్నాయి. కొందరు విద్యార్థులు గురుకుల డిగ్రీకళాశాలల్లోను నేరుగా ప్రవేశాలు పొందుతున్నారు. దీంతో కూడా ప్రభుత్వ కళాశాలల అడ్మిషన్లపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌లో మొత్తం 1,770 సీట్లకు 1,110 మాత్రమే భర్తీ అయ్యాయి. పింగిళి మహిళా కళాశాలలో 1,200 సీట్లకు 706 సీట్లు మాత్రమే భర్తీ కావడం గమనార్హం. అలాగే ఇతర డివిజన్ కేంద్రాలు, జిల్లా కేంద్రాల్లోని కాలేజీల్లో సగానికి పైగా సీట్లు ఖాళీగా ఉన్నాయి.

స్పాట్ అడ్మిషన్లు ప్రైవేట్ కాలేజీలకే..

డిగ్రీలో దోస్త్ ద్వారా సీట్లు కేటాయించిన కళాశాలల్లో ప్రవేశాలకు మంగళవారం గడువు ముగిసింది. ఆ తరువాత ఈనెల 13,14 తేదీల్లో రెండు రోజుల పాటు ఇప్పటివరకు ఏఏ కళాశాలల్లో ప్రవేశాలు పొందలేని విద్యార్థులకు ఉన్నత విద్యామండలి స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పించింది. ప్రైవేట్ డిగ్రీ కాలేజీలు నేరుగా తమ కళాశాలల్లో వేకెన్సీ సీట్లను భర్తీ చేసుకునే వీలు కల్పించింది. అయితే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మాత్రం స్పాట్ అడ్మిషన్లకు అవకాశం ఇవ్వలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మిగిలిన సీట్లను భర్తీచేసుకునేందుకు అవకాశం కల్పించాలని ఆ కళాశాలల అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ సురేందర్‌రెడ్డి, ఇతర బాధ్యులు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.అవకాశం ఇస్తారా లేదా అని చూడాల్సిందే.

కేటాయింపులు, భర్తీ సీట్ల వివరాలు..

కేయూ పరిధిలో మొదటిదశలో డిగ్రీ కళాశాలలకు 10,652 సీట్లు కేటాయించగా 5,289 మంది రిపోర్టు చేశారు. రెండో దశలో 9,732 సీట్లు కేటాయించగా అందులో 6,550 సీట్లు భర్తీ అయ్యాయి. మూడోదశలో 21,373 సీట్లు కేటాయించగా అందులో 17,019 సీట్లు భర్తీ అయ్యాయి. స్పెషల్ ఫేజ్‌లో 12,916 సీట్లు కేటాయించగా అందులో 11,727 మొత్తంగా 40,585 సీట్లు భర్తీ అయ్యాయి.

క్లుప్తంగా

29న కేయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్ష

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీసీఏ మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత పొంది ఆరో సెమిస్టర్ పరీక్షలో ఒక సబ్జెక్టు ఫెయిల్ యిన విద్యార్థులకు ఈనెల 29న ఇన్‌స్టంట్ పరీక్ష నిర్వహించనున్నామని పరీక్షల నియంత్రణాధికారి కె. రాజేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. సంబంధిత కళాశాలల నుంచి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేయూ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసి.ఇన్‌ను చూడాలని రాజేందర్ పేర్కొన్నారు.

కేజీబీవీలో డీఆర్‌ఓ విచారణ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఆర్‌ఓ సుహాసిని

సాక్షి స్పందన

బచ్చన్నపేట : మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో అధికారులు విచారణ చేపట్టారు. 'టీచర్లు కొడుతున్న విషయం చెప్పొద్దు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా రెవెన్యూ అధికారి సుహాసిని, జీసీడీఓ గౌసియాబేగం స్పందించి మంగళవారం విచారణ చేపట్టారు. ఉదయం 11 గంటలకు కేజీబీవీకి వచ్చిన అధికారులు పాఠశాలలోని ప్రతీ విద్యార్థితో సాయంత్రం 5 గంటల వరకు మాట్లాడారు. అలాగే, ఉపాధ్యాయులతో కూడా మాట్లాడారు. సీఈసీ సెకండియర్‌లో ఆరుగురు బాలికలకు టీసీలు ఎవరు ఇస్తామన్నారని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. అలాగే, క్రమశిక్షణతోపాటు నాణ్యమైన బోధన చేపట్టాలన్నారు. విచారణ నివేదికను కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారులకు అందిస్తామని వారు వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషలాఫీసర్ గీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి రిమాండ్



కన్నాయిగూడెం: కూలి హత్య కేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై వెంకటేష్ వెల్లడించారు. సీఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మూడు రోజుల క్రితం ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం సర్వాయి గ్రామానికి చెందిన మడి రాజబాబు భవన నిర్మాణ పనికి వెళ్లి మేస్త్రీ కుమ్మరి బాబును కూలీ అడిగాడు. ఈ విషయంలో మేస్త్రీ బావమరిది కోరం రంజిత్.. రాజబాబును హత్య చేసి పరారయ్యాడు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని పట్టుకుని విచారించిన అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



తెలంగాణ సైన్స్‌కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేయాలి

- కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి



కమిటీ బాధ్యులతో సమీక్షిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 19, 20, 21 తేదీల్లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు ఏర్పాట్లు చేయాలని కేయూ వీసీ కె. ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మంగళవారం అకడమిక్ కమిటీ హాల్‌లో సంబంధిత కమిటీల బాధ్యులతో నిర్వహించిన సమీక్షలో వీసీ మాట్లాడారు. సైన్స్‌కాంగ్రెస్‌కు హాజరు కాబోయే అతిథులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు ఉండాలన్నారు. వర్షాల నేపథ్యంలో కూడా అందుకనుగుణంగా ముందుకెళ్లాలన్నారు. క్యాంపస్‌లోని పలు సెమినార్‌హాళ్లలో పేపర్ ప్రజెంటేషన్‌లు ఉన్న నేపథ్యంలో అక్కడ ఆధునిక సాంకేతిక పరికరాలను కూడా ఏర్పాటుచేయాలన్నారు.ఈ సమీక్షలో రిజిస్ట్రార్ వి. రామచంద్రం, తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి. వెంకట్రామ్ రెడ్డి, ప్రొఫెసర్లు మల్లారెడ్డి, ఎస్. ప్రసాద్, స్వర్ణలత, డి. రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాల సందర్శనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు



డి.విజయ భాను, ఆర్టీసీ ఆర్‌ఎం, వరంగల్

హన్మకొండ: శ్రావణమాసం సందర్భంగా శైవ క్షేత్రాలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక పంచారామాల దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు. ఈ నెల 17న హనుమకొండ బస్ స్టేషన్ నుంచి ప్రత్యేక పంచారామ దర్శన యాత్రకు సూపర్ లగ్జరీ బస్సులు నడపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ యాత్రలో భక్తులు ఆంధ్రప్రదేశ్‌లోని ప్రసిద్ధి చెందిన పంచారామ క్షేత్రాలు అమరావతి అమరలింగేశ్వర స్వామి, భీమవరం శ్రీసోమేశ్వర స్వామి, పాలకొల్లు క్షీర లింగేశ్వర స్వామి, ద్రాక్షారామం భీమేశ్వర స్వామి, సామర్లకోట భీమేశ్వర స్వామి దర్శించుకోవచ్చన్నారు. ఒకే రోజు ఐదు శైవ క్షేత్రాలను దర్శించుకోవడం ద్వారా భక్తులు ఆధ్యాత్మిక అనుభవాలు పొందొచ్చన్నారు. ఈ యాత్ర బస్సులు ఆగస్టు 17న (ఆదివారం) సాయంత్రం 6 గంటలకు హనుమకొండ బస్ స్టేషన్ నుంచి ప్రారంభమై సోమవారం అన్ని క్షేత్రాల దర్శనం అనంతరం తిరిగి మంగళవారం ఉదయం హనుమకొండకు చేరుకుంటాయన్నారు. సూపర్ లగ్జరీ సర్వీస్ చార్జీలు పెద్దలకు రూ.2,300, పిల్లలకు రూ.1,400 నిర్ణయించినట్లు తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి సమాచారం, టికెట్ బుకింగ్ కోసం 9063407493, 7780565971, 9866373825, 9959226047 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఉద్యాన పంటల ఆవశ్యకతను గుర్తించాలి

- తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం సెంట్రల్ జోన్ హెడ్ సుచిత్ర



రైతులను సన్మానించి మొక్కలు అందజేస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

మహబూబాబాద్ రూరల్ : ప్రతి ఒక్కరూ ఉద్యాన పంటల ఆవశ్యకతను గుర్తించాలని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం సెంట్రల్ తెలంగాణ జోన్ హెడ్ సుచిత్ర అన్నారు. ఈమేరకు మంగళవారం మహబూబాబాద్ మండలం మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానంలో ఐసీఏఆర్, ఐఐఎంఆర్ షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక ఆర్థిక సౌజన్యంతో ఉద్యాన పంటల సాగుపై రైతులకు శిక్షణ నిర్వహించి మొక్కలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఉద్యాన పంటల ఆవశ్యకత, ప్రస్తుతం మార్కెట్ డిమాండ్, భవిష్యత్ వ్యాపార అవకాశాలపై తెలిపారు. ఉద్యాన విశ్వవిద్యాలయ పరిశోధనలు, మామిడి తోటల ఏర్పాటు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎరువులు, నీటి యాజమాన్యంపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి జినుగు మరియన్న, జేవీఆర్ ఉద్యాన పరిశోధన స్థానం శాస్త్రవేత్త, అధిపతి కత్తుల నాగరాజు, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కవిత, శాస్త్రవేత్త క్రాంతికుమార్, జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్ శాస్త్రవేత్త ప్రశాంత్, కేవీకే శాస్త్రవేత్త సుహాసిని పాల్గొన్నారు. మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించిన పలువురు రైతులను శాస్త్రవేత్తలు, అధికారులు సన్మానించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

- ఆరు తులాల బంగారం, రూ.50 వేలు అపహరణ
- బుర్హాన్‌పురంలో ఘటన



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

మరిపెడ రూరల్: కుటుంబ సభ్యులందరూ కలిసి ఓ శుభకార్యానికి వెళ్లగా ఇదే అదునుగా భావించిన దొంగలు తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం బుర్హాన్‌పురంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గడ్డం వెంకట్‌రెడ్డి వ్యవసాయ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉండగా ఇద్దరికీ వివాహాలయ్యాయి. కాగా, కుమార్తె ఇంట్లో ఓ శుభకార్యం ఉండగా కుటుంబీకులంతా కలిసి ఈ నెల 9వ తేదీన కాజీపేట వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువా పగులగొట్టి అందులో భద్రపరిచిన ఆరు తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు అపహరించారు. మంగళవారం తెల్లవారుజామున ఇంటి తలుపులు తీసి ఉండడంతో స్థానికులకు అనుమానం వచ్చి యజమానికి ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ రాజ్‌కుమార్, ఎస్సై సతీశ్, అదనపు ఎస్సై కోటేశ్వర్‌రావు ఘటనా స్థలికి చేరుకుని ఆధారాలు సేకరించారు. అనంతరం యజమాని వెంకట్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రజితకు కన్నీటి వీడ్కోలు..

- నివాళులర్పించిన రచయితలు, వివిధ సంఘాల ప్రతినిధులు
- మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్, రిజిస్ట్రార్ రామచంద్రం
- కేఎంసీకి రజిత భౌతికకాయం దానం




అనిశెట్టి రజిత మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ రామచంద్రం, మాజీ ఎమ్మెల్యే వినయ్‌భాస్కర్



కేఎంసీకి రజిత భౌతికకాయాన్ని దానం చేస్తున్న వివిధ సంఘాల ప్రతినిధులు

కేయూ క్యాంపస్ : ప్రముఖ కవి, రచయిత్రి, ప్రజాస్వామిక రచయిత్రీల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజితకు మంగళవారం కన్నీటి వీడ్కోలు పలికారు. హనుమకొండలోని గోపాల్ పూర్ ప్రాంతంలోనివాసం ఉండే అనిశెట్టి రజిత (67)సోమవారం రాత్రి గుండెపోటుతో కన్నుమూసిన విషయం విధితమే. రజిత కేయూలో నాన్‌టీచింగ్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి కొన్ని సంవత్సరాల క్రితమే ఉద్యోగవిరమణ పొందారు. ఆమె అవివాహిత. కొంతకాలంగా అద్దె ఇంట్లో ఉంటున్నారు. గుండెపోటు వచ్చి అపస్మారకస్థితికి చేరడంతో రచయిత శోభారమేష్ ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఇంటి యజమాని నిరాకరించడంతో కేయూ తెలుగు విభాగం రిటైర్డ్ ఆచార్యులు కాత్యాయనివిద్మహే ఇంటి వద్దకు రజిత భౌతికకాయాన్ని తరలించారు. ఇక్కడ రచయితలు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు.. రజితకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజితతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

తెలంగాణ మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర..

ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత మృతి బాధాకరమని, తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో ఆమె క్రియాశీలక పాత్ర వహించారని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. రజిత భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. విలువలతోకూడిన జీవితానికి ఆమె నిదర్శనమన్నారు. స్త్రీ సామాజిక సమానత్వం కోసం తన రచనల ద్వారా చైతన్యం నింపారన్నారు.అనిశెట్టి రజిత తన రచనల ద్వారా ప్రజలను చైతన్యపర్చారని కేయూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం అన్నారు. అనిశెట్టి రజిత మృతి ప్రజాస్వామిక రచయిత్రిల వేదికకు తీరని లోటని ఆవేదిక జాతీయ కార్యదర్శి ఎల్లూరి మానస అన్నారు. రచయిత్రీగా రజిత తన అభిప్రాయాలు నిర్మోహమాటంగా వెల్లడించేవారని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డల లక్ష్మణ్ అన్నారు.

ఘన నివాళి..

అనిశెట్టి రజిత భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్యనవీన్, రచయితలు బన్న అయిలయ్య, వీఆర్ విద్యార్థి, టి చందు, తాయమ్మ రణ, శోభారమేశ్, పొట్లపల్లి శ్రీనివాస్‌రావు, ప్రజాఫ్రంట్ నేత బి.రమాదేవి, మహిళా సంఘం నేత సదాలక్ష్మి, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్లు జ్యోతిరాణి, వి.శోభ,గిరిజారాణి, విజయలక్ష్మి, కిష్టయ్య, విరసం నేత కుమారస్వామి, ప్రముఖ అనువాద రచయిత నలిమెల భాస్కర్, బంధు మిత్రుల కమిటీ బాధ్యురాలు భారతక్క ఉన్నారు.

కేఎంసీకి రజిత భౌతికకాయం దానం

సంతాపసభ అనంతరం రచయితలు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు అంబులెన్స్‌లో రజిత భౌతికకాయంతో కేయూ మొదటి గేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రజితకు జోహార్లు అర్పించారు. అనంతరం భౌతికకాయాన్ని వరంగల్ కేఎంసీకి తరలించి దానం చేశారు. అంతకు ముందు నేత్ర వైద్యులు రజిత నేత్రాలు సేకరించారు.

వివిధ సంఘాల బాధ్యుల సంతాపం

ప్రముఖ రచయిత్రి అనిశెట్టి రజిత మృతి బాధాకరమని, సమాజంలో మహిళల హక్కులపై తన రచనలతో చైతన్యం కలిగించారని మానవ హక్కుల వేదిక బాధ్యుడు జీవన్‌కుమార్ తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అదేవిధంగా సహృదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరాబాబు, ఉపాధ్యక్షుడు ఎస్‌వీఎస్‌చారి, సాహిత్య కార్యదర్శి మల్యాల మనోహర్‌రావు, వనం లక్ష్మీకాంతారావు, లక్ష్మణరావు, కాళోజి ఫౌండేషన్ బాధ్యుడు డాక్టర్ ఆగపాటిరాజ్‌కమార్ సంతాపం తెలిపారు.

అలంకరణ లైట్లు సర్దుతుండగా..

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- తొర్రూరులో ఘటన



సుమన్(ఫైల్)

తొర్రూరు: అలంకరణ లైట్లు సర్దుతుండగా ఓ యువకుడు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం తెల్లవారుజామున మహబూ బాబాద్ జిల్లా తొర్రూరులో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. తొర్రూరు మండలం పెద్దమంగ్యా తండాకు చెందిన జాటోత్ సుమన్ (30) వారాంతపు సంతల్లో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తొర్రూరు పట్టణం 2వ వార్డులోని అరుణోదయ కాలనీలో కొత్త ఇల్లు నిర్మించుకుని సోమవారం గృహ ప్రవేశ కార్యక్రమం పూర్తి చేశాడు. మంగళవారం బంధువులకు విందు ఇచ్చేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాడు. ఈ క్రమంలో ఇంటి గోడపై అలంకరణ లైట్లు సర్దుతుండగా విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలాడు. బంధువులు గుర్తించి విద్యుత్ నిలిపివేసి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వర్ధన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. సుమన్‌కు గతంలో ఓ మహిళతో వివాహమై విడాకులు కాగా ప్రస్తుతం మరో మహిళతో సహజీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనపై మృతుడి సోదరుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చైన్ స్నాచర్ల అరెస్ట్

- 27 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్ : ఇద్దరు చైన్ స్నాచర్లను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 27 గ్రాముల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ టౌన్ పీఎస్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సోమవారం తొర్రూరు మండలం మాటేడుకు చెందిన ముత్యం ప్రేమలీలను కత్తితో బెదిరించి ఆమె మెడలో ఉన్న సుమారు మూడు తులాల బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు లాక్కొని పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే తొర్రూరు పోలీసులు.. దంతాలపల్లి ఎస్సై రాజుకు విషయం తెలిపారు. ఎస్సై సూచన మేరకు బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు గణేశ్, లోకేశ్ వెంబడించి రామానుజపురానికి చెందిన మల్లం లింగయ్య సహకారంతో సూర్యాపేట జిల్లా మద్దిరాల పీఎస్ పరిధిలోని వేములపల్లి వైపునకు పారిపోయినట్లు తెలుసుకుని ఆ గ్రామస్తులు, సాయి, ఉదయ్, భిక్షపతికి సమాచారం చేరవేశారు. అంతలోనే తొర్రూరు, దంతాలపల్లి ఎస్సైలు ఉపేందర్ రావు, రాజు అక్కడికి చేరుకుని నేరం జరిగిన గంటలోనే ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన చైన్‌స్నాచర్లు వికాస్ కుమార్, శుభంకుమార్‌ను అరెస్ట్ చేసి బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో సహకరించిన ప్రజలను, తొర్రూరు సీఐ గణేశ్, ఎస్సైలు ఉపేందర్ రావు, రాజు, బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు గణేశ్, లోకేశ్‌ను ఎస్పీ అభినందించారు.

పింఛన్లు పెంచకుంటే గద్దె దించుతాం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

- సీఎం రేవంత్‌కు మందకృష్ణ హెచ్చరిక
- పాలకుర్తిలో నియోజకవర్గ సన్నాహక సమావేశం

పాలకుర్తి టౌన్: పింఛన్లు పెంచకుంటే సీఎం రేవంత్ రెడ్డిని గద్దె దించుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతు, ఒంటరి మహిళల పింఛన్ల పెంపు కోసం సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహా గర్జనను విజయవతం చేయాలని కోరుతూ మంగళవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ పథకం సాధన కోసం ఎమ్మార్పీఎస్ ఎంతో శ్రమించిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మౌనం వీడాలని, గడీ నుంచి బయటకు రావాలన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 50 లక్షల మంది దివ్యాంగులను మోసం చేస్తోందని, దీనిపై కేసీఆర్ ప్రతిపక్ష నాయకుడిగా పోరాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో దివ్యాంగులకు రూ. 6 వేలు, వృద్ధులకు రూ.4 వేలు, తీవ్ర వైకల్యం ఉన్న వారికి రూ.15 వేలు పెంచి పింఛన్లు ఇస్తామని పేర్కొందని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా పింఛన్లు పెంచకుండా రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. పింఛన్ పెంపు ఎప్పుడు అమల్లోకి వస్తుందని, కొత్త పింఛన్లు ఎప్పుడు ఇస్తారని 50 లక్షల మంది లబ్ధిదారులు ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు సునీల్ మాదిగ, యాదగిరి స్వామి, తాళ్లపెల్లి కుమార్, గద్దల కిశోర్, దిండిగల వెంకన్న, గుండాల రవి, రమేశ్, వలపు వెంకన్న, సుధాకర్, జలగం నరేశ్, దండు రామచంద్రం, శ్రీధర్ పాల్గొన్నారు.

పాలధారలా భీమునిపాద జలపాతం



జాలువారుతున్న జలపాతం

గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ సమీపంలోని భీమునిపాద జలపాతం పాలధారలా జాలువారింది. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన వర్షానికి జలపాతం పాలనురగలా జాలువారుతూ కనువిందు చేసింది.

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: రాష్ట్రంలో నాలుగు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఎన్పీడీసీఎల్‌లోని 16 సర్కిళ్ల ఎస్‌ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ ఈ నెల 13 నుంచి 16 వరకు వరుసగా అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిందని, ఈ నేపథ్యంలో సర్కిళ్ల సూపరింటెండెంట్ ఇంజనీర్లు, డివిజనల్ ఇంజనీర్లు, ఇతర అధికారులు హెడ్‌క్వార్టర్‌లో ఉంటూ విధులు నిర్వర్తించాలన్నారు. ఎప్పటికప్పుడు లోడ్ మానిటరింగ్ చేయాలన్నారు. ఎక్కడైనా అంతరాయాలు సంభవిస్తే వెంటనే సరఫరా పునరుద్ధరించేలా ఉద్యోగులు, మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకుని వెంటనే పనులు చేపట్టాలన్నారు. అత్యవసర పరిస్థితులు నెలకొనే అవకాశమున్న నేపథ్యంలో సిబ్బంది, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు షిఫ్ట్ విధానంలో 24 గంటలు విధులు కేటాయించాలన్నారు. విద్యుత్ సమస్యలుంటే వినియోగదారులు టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం అందించాలని కోరారు.